పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

## ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం -ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం మర్చి 2 ప్రభాతవార్త : పోలీస్ స్టేషన్లకు వచ్చే సామాన్యుల సమస్యల పట్ల స్పందించడంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకూడదని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (మీకోసం) కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఎస్పీ గారు మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో పోలీస్ శాఖను ఆశ్రయిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు. స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కేవలం తాత్కాలిక ఉపశమనం కాకుండా, సమస్య మళ్లీ పునరావృతం కాకుండా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. సమస్యను విన్న వెంటనే సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో ఎస్పీ ఫోన్లో మాట్లాడి, బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ వారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి మొత్తం 14 అర్జీలు వచ్చాయి. ఇందులో ప్రధానంగా కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు వంటి సివిల్ వివాదాలతో పాటు.. ఆధునిక కాలంలో సవాలుగా మారుతున్న సైబర్ మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, అధిక వడ్డీల వేధింపులు మరియు ప్రేమ పేరుతో మోసం వంటి అంశాలపై బాధితులు ఎస్పీ కి తమ గోడు వెళ్ళబోసుకున్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం సబ్ డివిజన్ డిఎస్పీ రఘువీర్ విష్ణు జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కె.వి.వి.ఎన్



సత్యనారాయణ ఇతర కార్యాలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్షరాంధ్ర ఫైనల్ పరీక్షకు శత శాతం హాజరయ్యేలా చూడాలి
### --జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం మార్చి 2 ప్రభాతవార్త :జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాశ్యలుగా చేసే అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 04న నిర్వహించబడుతున్న ప్రీ ఫైనల్ పరీక్షకు, మార్చి 15న నిర్వహించే ఫైనల్ పరీక్షకు రిజిస్టర్ అయిన వారంతా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరం సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వెబ్ ఎక్స్ ద్వారా మాట్లాడుతూ ప్రీ ఫైనల్ నిర్వహణకు అవసరమగు ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఇందుకు సంబంధించి పరీక్షా కేంద్రాలను గుర్తించాలని, ఇన్విజిలేటర్లను , మూల్యాంకనం చేసేందుకు సిబ్బందిని నియమించాలని తెలిపారు. పి.డి డి.ఆర్.డి.ఏ, మెప్మా పి.డి, డ్వామా పి.డి. లు రిజిస్టర్ అయిన వారందరినీ పరీక్షకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ



సమావేశంలో జిల్లా అధికారులు, అక్షరాంధ్ర నోడల్ అధికారి కె వి వి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


## నిరుపయోగంగా వీఆర్వో కార్యాలయాలు
### - పశువులకు నిలయంగా మారుతున్న వైనం

ప్రభాతవార్త చాట్రాయి : ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారి కార్యాలయాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో గత తెలుగుదేశం పార్టీ హయాంలో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా నిర్మించిన గ్రామ రెవెన్యూ కార్యదర్శిల కార్యాలయాలను జగన్ ప్రభుత్వం విస్మరించడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గ్రామ రెవెన్యూ కార్యదర్శి ఎవరు ఆ కార్యాలయాలను తెరిచిన దాఖలాలు లేకపోవడంతో కొన్ని కార్యాలయాలు పశువులు తల దాచుకునేందుకు ఉపయోగపడుతున్నాయి. మండల కేంద్రమైన చాట్రాయితో పాటు పర్వతాపురం, సోమవరం గ్రామాలలో సుమారు 5 లక్షల రూపాయలతో పక్కా భవనాలు నిర్మాణం చేశారు. అయితే ఈ భవనాలు నిర్మాణం చేసి ప్రారంభం అయినప్పటికీ ఏనాడు తెరుచుకుని ఉన్న దాఖలాలు లేవు. గ్రామ రెవెన్యూ అధికారులు ప్రజలకు గ్రామాలలో అందుబాటులో ఉంటారని లక్ష్యంతో నిర్మాణం చేసినప్పటికీ నిత్యం తలుపులు తాళాలు వేసి ఉండటమే తప్ప తీసిన దాఖలాలు ఏనాడు లేవు. రెవెన్యూ కార్యదర్శి కార్యాలయంలో నిర్మాణం జరుగుతుంటే ప్రజలు అధికారులు అందుబాటులో ఉంటానని ఆశించినప్పటికీ ఆశలన్నీ అడియాశులుగా మారాయి. లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్ము బూడిదలో పూసిన పన్నీరుగా మారిందని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. అయితే మిగిలిన గ్రామాల్లో కూడా ప్రభుత్వ కార్యాలయాల కోసం సలా సేకరణ జరిగినప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. ఈ విధంగా నిరుపయోగంగా ఉన్న భవనాలు ప్రభుత్వ అధికారులకు తెలిసినప్పటికీ దీనిపై ఏనాడు దృష్టిపెట్టిన దాఖలాలే లేవు. రెవెన్యూ కార్యదర్శి కోసం కట్టిన కార్యాలయాలను మరొక ప్రభుత్వ కార్యాలయానికి ఉపయోగించుకోవటానికి వీలున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వివరించడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు పశువుల పాకలాగా తయారై ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కావున మంత్రి పార్థసారథి, ఉన్నతాధికారులు ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలో కి వచ్చినందున



నిరుపయోగంగా ఉన్న భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

## గోదావరి ప్రజల గుండెల్లో యుద్ధ మేఘాలు
### తమవారికి ప్రాణ నష్టం ఉండదనే ధైర్యంతో పూజలు
### గల్ఫ్ దేశాల్లో తెలుగువారి ఆందోళన



నరసాపురం.... ప్రభాతవార్త : కూతురు పెళ్లి కోసమో.... కొడుకు చదువు కోసమో... మంచాన పడ్డ భర్త వైద్యం కోసం ఎలా ఏదో ఒక కారణంతో పొట్ట చేత పట్టుకుని గల్ఫ్ దేశాల్లో ఉంటున్న గోదావరి ప్రజలకు ఇరాన్ ఇరాక్ అమెరికా యుద్ధం గుండెల్లో బాంబులను పే లుస్తోంది. కువైట్ దుబాయ్ బెహరన్ ఇజ్రాయిల్ ఇండోనేషియా ఒమన్ ఇలా గల్ఫ్ దేశాల్లో దశాబ్దాలు గా తెలుగు వారు ఉంటున్నారు. వీరిలో అత్యధికంగా 80% మంది మహిళలే. పెళ్లయిన నాలుగైదు ఏళ్లకు కొడుకును కూతురును కన్నాక పొట్ట చేత పట్టుకుని గ ల్ఫుదేశం వెళ్లిపోవడం ఎన్నో ఏళ్ల నుంచి జరుగుతుంది. గతంలో కువైట్ యుద్ధం జరిగినప్పుడు కూడా తెలుగువారు వణికిపోయారు. కొందరికి ప్రాణా నష్టం కూడా జరిగింది. ఇప్పుడు దాదాపు 70% గల్ఫ్ దేశాలు అమెరికా స్థావరాలతో నిండి ఉండడంతో ఏ దేశంలోనూ రక్షణ లేకుండా పోయింది. గోదావరి జిల్లాలో ప్రతి ఊళ్లోనూ 500 నుంచి 1000 మంది వరకు గల్ఫ్ దేశంలోనే ఉంటారు. పుట్టి పెరిగింది ఇక్కడైనా బ్రతుకు నావ నడుస్తున్నది గల్ఫ్ దేశంలోనే. ఇళ్లల్లోనూ విద్యాసంస్థల్లోనూ ఆసుపత్రుల్లోనూ వ్యాపార సంస్థల్లో కంపెనీల్లోనూ మహిళలు యువత పనిచేస్తున్నారు. గతంలో అయితే ఎంతో కొంత లాభం ఉండేది కానీ ఇప్పుడు కేవలం బ్రతుకుతెరువుకు మాత్రమే సరిపోతుంది. అయినా సరే ఇక్కడ ఆమాత్రం పని కూడా దొరగకపోవడంతో రెండు మూడు సంవత్సరాలుకు ఒకసారి రావడం కుటుంబాన్ని చూసుకుని నెలకు రెండు నెలలకు మళ్ళీ మూట ముళ్ళు సర్దుకుని వెళ్లిపోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ పరిస్థితుల్లో యుద్ధం అక్కడ వారికి ఇక్కడ ఈ కుటుంబాల వారికి కూడా ఎన్నో సమస్యలను తెచ్చిపెట్టింది. టీవీల ముందు కూర్చుని భయం భయంగా తన వాళ్ళు ఏమైపోతారు అనేటువంటి దిగులుతో ఉన్నారు. ఇలా ఆయిల్ దేశాలకు వలసపోయిన వారు ఆశ్చర్యకంగా షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు వెనుకబడిన తరగతుల మహిళలే కావడం విశేషం. యుద్ధం ఎప్పటికి అవుతుంది ట్రంప్ తో చర్చలు జరుగుతాయా లేదా ఇరాన్ దూకుడుగానే వెళుతుందా లేదా వెనకడుగు వేస్తుందా ఇలాంటి అనేక ప్రశ్నలతో సెల్ ఫోన్ చూడడం టీవీ చూడడం ద్వారా వారు తమ వారి ఆచూకీ కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. కొంతమందికి అయితే ఫోన్లు కూడా పనిచేయడం లేదు. ఈ విపత్కర పరిస్థితిలో గోదావరి జిల్లాల ప్రజలు ధైర్యం తెచ్చుకుని ముందుకు సాగడం తప్ప మరో పరిష్కారం కూడా కనుచూపుమేరలో కనబడడం లేదు. ఒకటి రెండు గల్ఫ్ దేశాలు మినహా మిగతా దేశాల్లో ఎక్కడ విమానాల రాకపోకలు కూడా లేవు. ఆ దేశాల్లో బయటికి అనుమతించడం లేదు. యుద్ధమేఘాలు తగ్గితే గాని కారే కన్నీళ్లు ఆగవు.

## పి జి ఆర్ ఎస్ లో 179 దరఖాస్తులు- రెవెన్యూ క్లినిక్ లో32 దరఖాస్తులు

భీమవరం మర్చి 2 ప్రభాతవార్త :పుట్టెడు దుఃఖం తో వచ్చే బాధితులను అక్కునచేర్చుకుని ఓదార్చడంలో జిల్లాకలెక్టర్ నాగరాణి, జె.సి. రాహుల్ కుమార్ రెడ్డి తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. ప్రతిసామవారం కలెక్టరేట్ లో కనిపించే దృశ్యాలు, సంఘటనలలో జిల్లాను నడిపించే ఈ అధికారుల తీరును అభినందించకుండా ఉండలేము. ఈ సోమవారం కూడా ఇలాంటి సంఘటనలు మనసును కదిలీచ్చాయి. జిల్లా కలెక్టరేట్ పీజీ ఆర్ఎస్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డి ఆర్ ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పిడి కెసిహెచ్ అప్పారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పీజీ ఆర్ఎస్ ద్వారా అందిన ప్రతి వినతిని ఓర్పుతో చదివి సంబంధిత శాఖల అధికారులను తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాలు చుట్టూ తిరగకుండా నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిపాలనలో ప్రజా సమస్యల పరిష్కారం ప్రాధాన్యత గల అంశం అని, ఫిర్యాదుల పరిష్కారములో ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారం లబ్ధిదారులు సంతృప్తి స్థాయి పెరిగే విధంగా ఉండాలన్నారు. ఏదైనా కారణంగా ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే అందుకు గల కారణాన్ని లబ్ధిదారులకు అర్థమయ్యే విధంగా ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, మున్సిపల్, ఆర్డబ్ల్యూఎస్, ఆర్టీసీ సంబంధిత శాఖలకు సంబంధించి సమస్యలపై ఐ వి ఆర్ ఎస్ కాల్స్ ద్వారా ప్రజలు తెలియజేసే స్పందన పాజిటివ్ గా ఉండే విధంగా సమస్యల పరిష్కార చర్యలు ఉండాలన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి



పెట్టాలన్నారు. భూ సంబంధిత సమస్యలు, కొత్తగా వికలాంగ, వితంతు పెన్షన్లు, గృహ నిర్మాణం, ఇళ్ళు మంజూరు, సీనియర్ సిటిజన్స్ సమస్యలు, ఆరోగ్య అంశాలకు సంబంధించిన వివిధ సమస్యలపై ప్రజల నుండి పలు ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వృద్ధుల సంక్షేమ అప్పిల్లేట్ ట్రిబ్యునల్ మెంబెర్ మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర విద్యార్థుల ప్రతిభ

నరసాపురం రూరల్ మార్చి 2 ప్రభాతవార్త : స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎంబీఏ విద్యార్థులు వివిధ కళాశాలలు నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి బహుమతులు సాధించారు. ఎంబీఏ ఫైనల్‌కు చెందిన ఐ.టి. శ్యామ్ ప్రసాద్, తాడేపల్లిగూడెంలో శశి ఇంజినీరింగ్ కళాశాల నిర్వహించిన తొలి 'అన్వేషణ' కార్యక్రమంలో యంగ్ మేనేజర్ అవార్డును సాధించి ?5,000 నగదు బహుమతిని పొందారు. అలాగే ఎంబీఏ ఫైనల్ విద్యార్థిని డి. సునీత, అమలాపురంలోని బీవీసీ కళాశాలలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ సింగిల్స్ టోర్నమెంట్‌లో విజయం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ చైర్మన్ కె.వి సత్యనారాయణ , ట్రెజరర్ కె.వి. స్వామి , డైరెక్టర్ ఎ. శ్రీహరి , ప్రిన్సిపాల్ డా. ఎస్. సురేష్



కుమార్ , వైస్ ప్రిన్సిపాల్ డా. ఎ. గోపిచంద్ విద్యార్థులను అభినందించారు.

## చెస్ విజేతలకు కలెక్టర్ విషెస్ -తిరుపతిలో జరిగిన శాఫ్ లీగ్స్
### - రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో....
### - ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అభినందించారు



ఏలూరు, మార్చి 02: ప్రభాత వార్త : జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం తిరుపతిలో జరిగిన శాఫ్ లీగ్స్ రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను అభినందించి, ట్రోఫీలను, ప్రశంసా పత్రాలను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అందజేశారు. తిరుపతిలో జరిగిన శాఫ్ లీగ్స్ రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో మన జిల్లా నుంచి ఎ.తేజస్విని అండరు-19 విభాగంలో స్వర్ణ పతకం సాధించించారు. అదేవిధంగా అండరు-15 బాలుర విభాగంలో కొల్లా భవన్ రెండవ స్థానం సాధించి రజత పతకం సాధించారు. ఏలూరు వెస్ట్ స్ట్రీట్‌కు చెందిన ఎ.తేజస్విని సర్ సిఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల్లో రెండవ సంవత్సరం చదువుతోందని, కొల్లా భావన్ నుజివీడులోని కుమార్ సిబిఎస్ఇ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారని ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ క్రీడల ద్వారా ప్రపంచ స్థాయిలో మన దేశ, రాష్ట్ర కీర్తిని ఇనుమడింపచేసేలా ప్రతిభ కనపరచలన్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా క్రీడల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని క్రీడాకారులకు తెలియజేస్తూ అభినందనలు, తెలిపారు. క్రీడాకారులు కృషికి తల్లిదండ్రులు మరియు శిక్షకులు సహకారం ప్రశంసనీయమని తెలిపారు. జిల్లా క్రీడా అభివృద్ధికి ఇటువంటి విజయాలు మరింత ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, స్ఫూర్తినిస్తాయని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి సయ్యద్ అబ్దుల్ అజీజ్, క్రీడాకారులు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కారంలో ముందుండాలి
### కొల్లు పెద్దిరాజు

నరసాపురం ప్రభాతవార్త :నరసాపురం మండల ప్రజా పరిషత్ లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు పాల్గొన్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ మైలాబత్తుల సోని అధ్యక్షత వహించారు. సర్పంచులు ఎంపీటీసీలు వాళ్ల పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారులతో చెప్పడం జరిగింది. చైర్మన్ పెద్దిరాజు మాట్లాడుతూ సమావేశానికి ప్రజాప్రతినిధులు ఏవైతే సమస్యలు తెలిపారో వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు అలాగే ప్రతిపక్ష ప్రజా ప్రతినిధులు అందరూ నరసాపురం నియోజకవర్గ




అభివృద్ధికి కృషి చెయ్యాలని సూచించారు. ఈ సమావేశంలోఁయి ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.


## భోగేశ్వరంలో 16 రోజుల పండుగకు అపూర్వ స్పందన

కలిదిండి మార్చి 2 (ప్రభాతవార్త): స్థానిక భోగేశ్వరలంకలో కొలువై ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధిలో సోమవారం నిర్వహించిన 16 రోజుల పండుగ ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయవంతమైంది. ఉదయం శ్రీ స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ అభిషేకములు, అన్నాభిషేకములు పూర్ణాహుతి కార్యక్రమం తదుపరి కలిదిండి వాస్తవ్యులు భవాని లారీ సప్లై ఆఫీస్ ప్రొపరేటర్ చిట్టూరి నాగేశ్వరరావు ఆర్థిక సౌజన్యతో 7 వేల మందికి అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సమారాధన కార్యక్రమం కలిదిండి చుట్టుపక్కల గ్రామాల నుండి వేలాది మంది భక్తులు భారీగా తరలివచ్చారు.స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈవో సింగనపల్లి మాట్లాడుతూ 16 రోజులు పండగ చిన్నచిన్న గా ప్రారంభమై ఈరోజు పెద్ద ఎత్తున జరుగుతుందని, ఈ పండుగకు భక్తుల నుండి అపూర్వమైన స్పందన ఏర్పడిందని తెలిపారు.




## కొండాలమ్మ తల్లి జాతర

నరసాపురం ప్రభాతవార్త :నరసాపురం పట్టణంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవాలయంలో జరుగుతున్న జాతర మహోత్సవాల సందర్భంగా ఈరోజు నరసాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పొత్తూరి రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొండాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రాంతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని, ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జాతర ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్న దేవస్థానం కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కొల్లు పెద్దిరాజు కొప్పాడ నరేష్ మల్లాడి బాలు దేవాలయ కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బొండాడ గ్రామ దేవతలు పోలేరమ్మ మహాలక్ష్మిమ్మ జాతర మహోత్సవాలు



కాళ్ళ, మార్చి2 (ప్రభాత వార్త) : బొండాడ గ్రామ దేవతలు శ్రీ పోలేరమ్మ శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి 51 వ వార్షిక జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 5 వరకు నిర్వహిస్తారని ఆలయ కార్య నిర్వహణ అధికారి వేగేశ్న ఆంజనేయ రాజు తెలిపారు. తానుకొండ పాల వెంకటరావు అనంతలక్ష్మి దంపతుల కుమారుడు కేదారేశ్వర రావు లక్ష్మి దంపతుల చే కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమైనట్లు కమిటీ ఆర్గనైజర్ మందపాటి కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం కప్పగంతుల హనుమత్ విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో మన్నే కేదారేశ్వర రావు సత్తెమ్మ జ్ఞాపకార్థం రామకృష్ణ, రామాంజనేయులు, సుబ్బారావు, సత్యనారాయణ, షణ్ముఖ మణికంఠ దంపతుల చండీ హోమం నిర్వహించారు. ఈ చండీ హోమం లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని మంగళవారం ఉదయం 8 గంటలకు మూసివేసి బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు తెరుస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 8వ తేదీన మందపాటి రామారావు సావిత్రమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు విశ్వేశ్వరరావు, కోటేశ్వరరావు( లేటు) వెంకన్న లు లక్ష రూపాయలు విరాళం, అమృత వైన్ చిక్కాల సత్య జగదీష్ ప్రసాద్ 50,000, మందపాటి గోపాలం 25000, చెరుకువాడ నాగార్జున 25000, బొండాడ బొండాడ పేట గౌడ సంఘం 100 కేజీల మటన్ విరాళాలతో ఈ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మందపాటి కృష్ణమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు గొర్ల లక్ష్మణస్వామి, గుడిగంటల ఫణీంద్ర, మేక వెంకన్న బాబు, పెద్దిరాజు అరిటాకు సత్యనారాయణ, గుడ్ల సురేంద్ర, సూర్యనారాయణ, టైలర్ శ్రీను, మన్నే సోమేశ్వర రావు, శ్రీను, సేనాపతి వెంకటేశ్వరరావు తెలిపారు.

## టిడిపిలో పదవులు పొందిన వారికి గౌడ సంఘం సత్కారం

కైకలూరు మార్చి 2 (ప్రభాతవార్త) : ఇటీవల తెలుగుదేశం పార్టీలో పదవులు పొందిన ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు గా పోసిన పాండురంగారావు, కైకలూరు మండల అధ్యక్షులుగా పంది రాధాకృష్ణ, కైకలూరు టౌన్ అధ్యక్షులుగా పడమట వాసు లను నియమించడం పట్ల కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం తరపున సోమవారం జరిగిన ఓ సమావేశంలో సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీకి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘ నాయకులు పోసిన చెంచు రామారావు,కైకలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు , మరియు ముఖ్య నేతలు పాల్గొన్నారు.



